# ఇరాన్ అణుశక్తి హక్కుల విషయంలో

# భారత్ వైఖరి న్యాయమైనదా? తెలివయినదా?

ఇరాన్ అణుబాంబు తయారు చేసుకునే సామర్థ్యాన్ని రహస్యంగా పెంపొందించుకుంటోందనే అమెరికా ఆరోపణను భద్రతా మండలికి నివేదించాలన్న ప్రతిపాదనకు మద్దతుగా భారత్ ఓటు వేయడం అనుకూల, వ్యతిరేక ప్రకటనలకూ, వాదనలకూ దారితీసిన విషయం తెలిసిందే. మన దేశ పాలకులు దేశం లోపలయినా, బయటయినా అన్యాయంగా నడుచుకున్నట్టయితే తెలుసుకోవడం, విమర్శించడం దేశ పౌరులుగా మన కర్తవ్యం కాబట్టి ఈ ఉదంతం పూర్వాపరాలు, భారత్ తీసుకున్న నిర్ణయంలోని న్యాయాన్యాయాలు మనం చర్చించుకోవాలి.

అగ్రరాజ్యాలు తమ వద్ద మాత్రమే అణుబాంబులు ఉండాలనీ, వేరే ఎవ్వరి వద్దా ఉండడానికి వీలులేదనీ మొదటి నుండి అంటూ వచ్చాయి. కొత్తగా ఎవరూ బాంబులు తయారుచేసుకోకుండా చూడడానికి అణువ్యాప్తి నిరోధక ఒడంబడికను (ఎన్‌పిటి) రూపొందించి, దానిపైన సంతకం చేయవలసిందేనని బాంబులు లేని దేశాలపైన ఒత్తిడి పెట్టాయి.

ఎన్‌పిటి పైన సంతకం చేసిన దేశాలలో ఇరాన్ ఒకటి. ఎన్‌పిటి అన్యాయమైన ఒడంబడిక అని నిరసించిన దేశాలలో ఇండియా ఒకటి. మనం కూడ అణుబాంబు తయారు చేసుకున్న తరువాత మన పాలకులకు సహితం ఈ విషయంలో అగ్రరాజ్యాల బుద్ధి సోకింది గానీ అంతకు ముందు మనమన్నదేమిటంటే, అణుబాంబులు ఎవరివద్దా ఉండకూడదంటే సరేగానీ, కొందరు అణ్వస్త్రాలు ఉంచుకొని మిగిలిన వాళ్లకు ఆ హక్కు లేదనడం అన్యాయం అని. కాబట్టి మన పాలకులు అగ్రరాజ్యాలను ధిక్కరించి బాహాటంగానే అణుబాంబులు తయారు చేసుకున్నారు. ఇరాన్ అదే పని ఒకవేళ రహస్యంగా చేసుకుంటే మనకు కోపం ఎందుకు?

ఇరాన్ విషయంలో 'మన భద్రతకు మనం ప్రాధాన్యం ఇచ్చాం' అని ప్రధాని వివరణ ఇచ్చారు. ఆ మాట ఇరాన్ కూడ అనవచ్చునా? ఒకసారి ఆసియా చిత్రపటం చూడండి. ఇరాన్‌కు ఒకవైపు సరిహద్దు ఉన్న పాకిస్తాన్‌కు అణుబాంబు సామర్థ్యం ఉంది. రెండవ వైపు సరిహద్దు ఉన్న ఇరాక్ అమెరికా అదుపులో ఉంది. అమెరికా అణ్వస్త్ర సామర్థ్యం గురించి చెప్పనవసరం లేదు. సరిహద్దు దాటి ఇంకొంచెం దూరం దృష్టి సారించినట్టయితే ఇరాన్ చుట్టూ అర్ధవలయాకారంలో ఇజ్రాయల్, రష్యా, చైనా, ఇండియా పరచుకొని ఉన్నాయి. ఇవన్నీ అణుబాంబు గల దేశాలే. వీటిలో ఇజ్రాయల్ 1979 నుండీ ఇరాన్‌ను తన శత్రువుగా ప్రకటించి ఉంది, ఒకసారి ఇరాన్‌పైన దాడి కూడ చేసి ఉంది. నిజానికి, తన పరిసరాలలో ఇన్ని అణుబాంబులు కలిగి ఉన్న దేశాలు ఉండీ, తాను మాత్రం త్యజించిన దేశం ఇరాన్ తప్ప ప్రపంచంలో వేరే ఏదీ లేదేమో.

ఇరాన్ ఎన్‌పిటి మీద సంతకం చేయడమే కాక, అనుమానం వస్తే వెతుక్కునే అధికారం కూడ అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు (ఐఏఇఏకి) ఇచ్చింది. అక్కడితో ఆగిపోకుండా, యుద్ధేతర అవసరాల కోసం యురేనియం 'ఎన్‌రిచ్‌మెంట్' చేపట్టినా కూడ దానిని లోపాయకారీగా అణ్వాయుధాల తయారీకి వాడుకోవచ్చునన్న అగ్రరాజ్యాల కుశంకను సహితం గౌరవించి 3 సంవత్సరాల పాటు దానిపైన తానే నిషేధం విధించుకుంది. అయితే అగ్రరాజ్యాలను ఒకటి మాత్రం కోరింది. తన సాంకేతిక అవసరాలకూ, భద్రతావసరాలకూ న్యాయం చేకూర్చే బాధ్యత వారిదేననింది. వారు సై అన్నారుగానీ ఏమీ చేయలేదు.

ఏమీ చేయకపోగా, నువ్వు రహస్యంగా అణుబాంబులు తయారు చేసుకుంటున్నావని మాకు అనుమానంగా ఉంది కాబట్టి మా పరిశీలకులను పంపుతున్నాం అన్నారు. ఇరాన్ సహకరించింది. వాళ్లు

వెతికారు, వెతికారు, రెండేళ్లు వెతికారు గానీ ఏం దొరకలేదు. 'అయినప్పటికీ మా అనుమానం నివృత్తి కాలేదు' అన్నారు ఐఏఇఏ వారు. ఆపైన ఇరాన్ విషయాన్ని భద్రతా మండలికి నివేదించారు.

ఇదేమయినా న్యాయమా? భారత్ దీనికి సహకరించడం సబబా? అన్నది మన ముందున్న ప్రశ్న.

దేశంలో నాలుగవ వంతు జనాభాకు అన్నం పెట్టలేకపోయినా, ఒక అగ్రరాజ్యంగా గుర్తింపు పొందాలని మన వాళ్లకీమధ్య కోరిక పట్టుకుని గతాన్ని మరచిపోయారు గానీ దశాబ్దాల తరబడి అణుశక్తి వ్యాప్తి నిరోధక ప్రయత్నాల పట్ల భారత పాలకులు అనుసరించిన వైఖరికీ ఇవ్వాళ ఇరాన్ అంటున్నదానికీ తేడా ఏమీ లేదు. 'మాకు అణుబాంబు తయారు చేసుకోవాలన్న కోరిక లేదు. అయితే మాతో శత్రుత్వం ఉన్నవారు తయారు చేసుకుంటే చేతులు ముడుచుకొని కూర్చోము. అంతేకాక, శాంతియుత అవసరాల కోసం మేము అణుశక్తిని వినియోగించుకున్నట్టయితే అదే క్రమంలో బాంబులు తయారు చేస్తామేమోనని ఏ అమెరికాకో అనుమానం వచ్చినంత మాత్రాన మా సాంకేతిక అవసరాలను మేము వదులుకోము.' ఇదే కదా భారత్ నోట జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుండి విన్న మాట? ఇప్పుడు ఇరాన్ ఆ మాటే అంటే మన పాలకులకెందుకు అభ్యంతరమనిపిస్తున్నది?

భద్రతా మండలిలో మనం సహితం శాశ్వత సభ్యత్వం పొంది, వీలయితే వీటో హక్కు కూడ పొంది, అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొంది, ఊరిలో కాకపోతే గల్లీలోనయినా దాదాగా బతకాలన్న పెడబుద్ధి మన పాలకుల కళ్లకు పొరలు కప్పిందనుకోకూడదా? ఈ కోరికలు తీరాలంటే అమెరికా పంచన చేరడమొక్కటే మార్గం అన్న అతి తెలివి వారి నైతిక స్పృహను మసకబార్చిందనుకోకూడదా?

రాజకీయాలలో- ముఖ్యంగా అంతర్జాతీయ రాజకీయాలలో- ప్రయోజనాలకే తప్ప విలువలకు చోటులేదని నమ్మేవారికి ఈ ప్రశ్నలు రుచించక పోవచ్చు. అయితే ప్రయోజనాలనే ప్రమాణంగా పెట్టుకున్నా అమెరికా బంటుగా ముద్రపడడం ఇండియాకు రాజకీయంగా ప్రయోజనకరమా? ఆర్థికంగా అసలే ప్రయోజనకరం కాదని చెప్పవచ్చు. సహజవనరులు అత్యధికంగా ఉన్నది ఆసియాలో. దశాబ్దాలుగా ఆసియా దేశాలు పరాధీనులుగా ఉండి పరస్పర సంబంధాలు పెంపొందించుకోలేదు. మతాన్నీ, అగ్రరాజ్యాల ప్రయోజనాలనూ ప్రాతిపదిక చేసుకొని పరస్పర ద్వేషం పెంచుకున్నాయి కూడ. ఆ రోజులు పోయే పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. భారత్ పాకిస్తాన్‌తోనూ, చైనాతోనూ సంబంధాలు క్రమంగా మెరుగు పరచుకుంటున్నది. ఇరాన్‌తో నిజానికి మొదటినుండి భారత్‌కు మంచి సంబంధాలున్నాయి. దీనిని మరింత పెంపొందించుకొని బలమైన 'దక్షిణార్ధాన్ని' రూపొందించగల తరుణంలో ఇక్కడి సంబంధాలు పాడు చేసుకొని అమెరికాను నమ్ముకోవడం తెలివితక్కువతనం కాదా? చర్చించుకుందాం రండి.

# బహిరంగ సభ

21 ఫిబ్రవరి (మంగళవారం) సా॥ 6.00 గంటలకు

ప్రెస్ క్లబ్, బషీర్‌బాగ్

**ప్రొఫెసర్ రమా మెల్కోటె**

**డా॥ చెన్నబసవయ్య**

**డా॥ ఎం.కోదండరాం**

మాట్లాడతారు.

**మానవహక్కుల వేదిక**
Human Rights Forum (HRF)

నగర కమిటీ
హైదరాబాద్